నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, సోమవారం 2 డిసెంబర్ 2024 YADADRI BHUVANAGIRI


## డోల్‌పుర్ పాలపాడితో కృత్రిమ పాలు

- 120 లీటర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 1 : పాలపాడితో కృత్రిమపాలు తయారు చేస్తున్న వ్యక్తిపై ఎస్ఓటీ, రూరల్ పోలీసులు దాడులు చేశారు. 120లీటర్ల కృత్రిమ పాలు, 3 డోల్‌పుర్ పాలపాడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన వల్లపు నర్సింహ పాల వ్యాపారి. డోల్‌పుర్ పాలపాడి ప్యాకెట్లతో కృత్రిమ పాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం ఎస్ఓటీ, రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో నర్సింహ వద్ద 120 లీటర్ల కృత్రిమ పాలు, 3కిలోల పాలపాడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, కృత్రిమ పాలకు సంబంధించిన నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.



క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల సందడి

# గురుకులాలపై సర్కారు నిర్లక్ష్యం

## హాస్టళ్లలో వసతులు కరువు.. అందని నాణ్యమైన భోజనం

- అపరిశుభ్రతతోనే విద్యార్థులకు అస్వస్థత
- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ గురుకులాల బాట
- గురుకులాలపై నమ్మకం పోగొట్టిన రేవంత్‌రెడ్డి : బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 1 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం జిల్లాలో గురుకులాల బాట చేపట్టారు. ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి సౌకర్యాలు, వంట గదులు, పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. హాస్టళ్లలోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భువనగిరి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల, వసతి గృహం, బీసీ బాలికల కళాశాల, మైనారిటీ గురుకుల కళాశాలను బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులు, ఆరోగ్యం, భోజనం వంటివాటిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుంగ బాలు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారులో సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా మారాయన్నారు. 11 నెలల కాలంలో హాస్టళ్లలో పలువురు విద్యార్థుల చనిపోయారని, ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ పాపం కాంగ్రెస్‌దేనని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ గురుకులాలు నిలిచాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఏడాది కాలంలోనే గురుకులాను భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లపై నమ్మకం పోయిందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపుతోనే పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అన్ని సమస్యలు పరిష్కరించే వరకూ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని, విద్యార్థుల తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఒగ్గు శివకుమార్, ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్, జిల్లా కో-ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రాకల రమేశ్, మన్నె ప్రభాకర్, ఎండీ మున్నా, వంశీగౌడ్, సాయి, రత్నపురం పద్మ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలోని బీసీ గురుకుల పాఠశాలలో పెచ్చులూడుతున్న స్లాబ్‌ను పరిశీలిస్తున్న తుంగ బాలు



భువనగిరిలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు

## యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం



ప్రధానాలయంలోని క్యూ లైన్‌లో భక్తులు

యాదగిరిగుట్ట, డిసెంబర్1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొన్నది. కార్తిక మాసం చివరిరోజుతో పాటు సెలవుదినం కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే మహిళల దీపారాధనలో పాల్గొన్నారు. కొండకింద వ్రత మండపం భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచే సత్యనారాయణ వ్రతమాచరించేందుకు దంపతులు తరలివచ్చారు. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద స్నాన సంకల్పం, మాఢవీధుల్లో అఖండ దీపారాదనలో పాల్గొని తరించారు. శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రాకతో తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాదవిక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మదర్శనానికి 2 గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానకు రూ. 56,71,426 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

### కార్తికమాసంలో 23,248 వ్రతాలు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా ఈ ఏడాదిలో సత్యనారాయణ వ్రతాల సంఖ్య గతంతో పోలిస్తే అధిక సంఖ్యలో జరిగినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది 23,248 వ్రతాలు జరిగినట్లు తెలిపారు. గత 2023 మాసంలో 20,524 వ్రతాలు జరుగగా, ఈ సారి అధికంగా 2,724 జరిగినట్లు చెప్పారు. కార్తిక మాసం అదాయం మాత్రం అధికారికంగా ప్రకటించలేదు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన కలెక్టర్ హనుమంతరావు

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 1 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. గణితం సంబంధించిన అభ్యాసన సామర్థ్యాలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. హాస్టల్‌లో భోజనం మంచిగా ఉంటుందా, సబ్జెక్ట్ పోర్షన్ కంప్లీట్ అయిందా అని అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలు పొందాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో క్విజ్ పోటీలు నిర్వహించాలని ఎంఈఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఎంఆర్ఐలు గుత్తా వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు మనోహర్, కరుణాకర్ పాల్గొన్నారు.

### రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.370 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. భూదాన్‌పోచంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో యాదాద్రి జిల్లా మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావచ్చాయని, 21 కేంద్రాల్లో లేటుగా వచ్చే సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే 98 శాతం పూర్తయిందని, డాటా ఎంట్రీ 97శాతం అయ్యిందని అన్నారు. హాస్టళ్లలో భోజనం నాణ్యతను పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 89 హాస్టళ్లలో ఏకకాలంలో రాత్రి బస చేశామని, మధ్యాహ్న భోజనం, హాస్టళ్ల సమస్యలపై అధికారులు నివేదిక అందజేశారని తెలిపారు.

## వాతావరణ కాలుష్యం సృష్టించే కంపెనీలు మాకొద్దు

- కంపెనీల ఎదుట కాటేపల్లి గ్రామస్తుల ఆందోళన



కాటేపల్లిలో నిర్మిస్తున్న టైర్ల రీసైక్లింగ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మోటకొండూర్, డిసెంబర్ 1 : వాతావరణ కాలుష్యం సృష్టించే టైర్ల రీసైక్లింగ్ కంపెనీలు తమ గ్రామంలో ఏర్పాటు చేయొద్దని మండలంలోని కాటేపల్లి గ్రామస్తులు, రైతులు ఆదివారం ఆందోళన చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న రెండు టైర్ల కంపెనీల వద్ద ధర్నా చేశారు. కంపెనీల నిర్మాణంతో వాతావరణంలో అనేక సమస్యలు వస్తాయని, గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా, రైతులకుగానీ, ప్రజలకు గానీ సమాచారం లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కంపెనీలకు నోటీసులు ఇచ్చి వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. విషయంపై రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, స్థానిక ఎమ్మెల్యేతోపాటు పలు శాఖలకు చెందిన అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల నుంచి వచ్చే దట్టమైన పొగ వల్ల పంటలకు, మనుషులు, పశువులు, గొర్రెలు, మేకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంత్రి రాజు, గ్రామస్తులు పచ్చిమట్ల సత్తయ్య, మంత్రి దేవయ్య, మంత్రి ఉప్పలయ్య, పచ్చిమట్ల వెంకటయ్య తదితరులు ఉన్నారు.



## చెర్వుగట్టులో భక్తుల సందడి

భక్తులతో కిటకిటలాడుతున్న చెర్వుగట్టు ప్రాంగణం

నార్కట్‌పల్లి, డిసెంబర్ 1 : మండల పరిధిలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసంలో ఆదివారం చివరి అమావాస్య కావడంతో దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు కొండపైన రాత్రి నిద్ర చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ నవీన్ కుమార్ మౌలిక వసతులు కల్పించారు.

# పని చేయించుకున్రు.. పైసలు ఎగ్గొట్టిన్రు

- కూలీల కడుపు కొట్టిన అధికారులు
- డబ్బులు రాలేదని కుంటి సాకులు



నకిరేకల్ మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో కార్యక్రమంలో భాగంగా పిచ్చిచెట్లు తొలగిస్తున్న కూలీలు(ఫైల్)

నకిరేకల్, డిసెంబర్ 1 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో హడావిడిగా కూలీలతో పనిచేయించుకున్రు.. పైసలు ఎగ్గొట్టిన్రు..ఆయా గ్రామ పంచాయతీల్లో డబ్బులు జమ అయినా ఇవ్వకుండా అధికారులు కూలీల కడుపు కొడుతున్న సంఘటనలు లేకపోలేదు. పైగా డబ్బులు రాలేదని అధికారులే కుంటి సాకులు చెబుతుండడం గమనార్హం. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం ఆగస్టు 5నుంచి 9వ తేదీ వరకు 14 మంది కూలీలతో పిచ్చి చెట్లు తొలగింపు, కంప చెట్లు కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పనిచేసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా తమకు డబ్బులు ఇవ్వడం లేదని గ్రామ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టం తమకు రావాలని, కూలీ డబ్బులు ఇవ్వాలని అధికారులను అడిగితే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ పొంతలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా 'స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రోజువారీ కూలీలను పెట్టి పనిచేయించాం. కొన్ని గ్రామపంచాయతీల్లో కూలీలకు డబ్బులు ఇచ్చాం. కొంతమంది కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే కూలీలకు అందజేస్తాం' అని బదులిచ్చారు.

### మా కష్టం మాకు ఇప్పించండి సారూ



గోరెంకలపల్లిలో బడిల, గుడి దగ్గర, గ్రామ పంచాయతీ ఆఫీసు కాడ, ఊళ్ల మొత్తం చెట్లన్నీ తొలగించినం. 14 మంది కూలోల్లం ఐదు రోజులు పని చేసినం. మా డబ్బులు మాకియ్యాలని ఎంపీడీఓను అడిగినం. కార్యదర్శిని అడిగినం. ఎవరూ పట్టించుకుంటలేరు. పని చేపించుకుని అవతల పడ్డరు.

- వంగూరి ఏసయ్య, కూలీ

### వర్షంలో తడుసుకుంటూ పని చేసినం



ఆగస్టులో వర్షంలో తడుసుకుంటూ పనిచేసినం. కంపచెట్లు కొడుతుంటే చేతులకు కాళ్లకు తగిలి రక్తాలు కారుతున్నా పట్టించుకోలే. సార్లు చెప్పిన్రని పని చేసుకుంట పోయినం. అసోంటిదిగిప్పుడు పైసలు అడిగితే ఒకాయన మీద ఒకానయ చెప్పుకుంటున్రు. మా పైసలు ఇయ్యకపోతే కలెక్టర్ కాడికిపోతం.

- శెట్టిపల్లి శ్యాంసన్, కూలీ

## నిడమనూరు మోడల్ స్కూల్ టీచర్ సస్పెన్షన్

- ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్

నిడమనూరు, డిసెంబర్ 1 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు(టీజీటీ)ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడు తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ విద్యార్థినులు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మలకు మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేసి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నిలదీసిన ఘటనపై వార్తా కథనాలు ప్రచురితమవడంతో ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించారు. విద్యార్థినుల సంక్షేమం, ఘటనలపై పర్యవేక్షణ చేయకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శించి వార్తా కథనాలు వెలువడే వరకు శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం వంటి కారణాల నేపథ్యంలో ఎందుకు సస్పెండ్ చేయకూడదో ప్రిన్సిపాల్ వెంటనే రాతపూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఆదేశిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఎంపికైన మహిళా కబడ్డీ జట్టుతో కరచాలనం చేస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, డిసెంబర్ 1 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన 71వ సీనియర్స్ మహిళల కబడ్డీ జట్ల ఎంపికలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలో క్రీడలకు పెద్దపీఠ వేసిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 సంవత్సరాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. కబడ్డీలో బాలికలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొంది పాఠశాలలకు పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 126 మంది బాలికలు కబడ్డీ పోటీల్లో పాల్గొనడం హర్షనీయమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాల శాఖాధికారి ధనుంజయ్య, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి గంధమల్ల కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మాదానీ జోసెఫ్, విజయ్‌కుమార్, నరేశ్, చంద్రకుమార్, సందీప్, శ్రావణ్, రజిత, శ్రీలత, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.